క్లుప్తంగా

డిప్యూటీ డీఈఓ విచారణ



మాట్లాడుతున్న మండల కమిటీ సభ్యులు

ఓజిలి: మండల విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు వజ్రమ్మ తొలగింపుపై డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఫిబ్రవరి 16వ తేదీన వజ్రమ్మ రాజీనామా సమర్పించడంతో మరొకరిని మండల కమిటీ, తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో నియమించారని ఎంఈఓ శైలజ తెలిపారు. తల్లిదండ్రుల కమిటీ, మండల కమిటీ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని డిప్యూటీ డీఈఓ తెలిపారు. తహసీల్దార్ లాజరస్, ఎంపీడీఓ రజనీకాంత్, సర్పంచ్ శేషమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా

సైదాపురం: అర్హత ఉన్న ప్రతి రైతుకూ రైతు భరోసా పథకం వస్తుందని పొదలకూరు ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చాగణం, సైదాపురంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన స్థానిక ఏఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. పంట నమోదుతోపాటు ఆర్బీకేలో రైతులకు అందించే సేవలపై చర్చించారు. ఏఓ హైమావతి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కోట: మండలంలోని ఊనుగుంటపాళెంలో గురువారం పక్కాగృహాల నిర్మాణానికి ఎంపీపీ దాసరి అంజమ్మ భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పేదలకు పక్కా గృహాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో త్వరగా పక్కా గృహాలు నిర్మించి త్వరలోనే లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంపీడీఓ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, సర్పంచ్ చెంగయ్య, కోటారెడ్డి, నాగూరుయాదవ్ పాల్గొన్నారు.

ప్రణీత్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

గూడూరు: పంబలేరు నీటి గుంతలో అనుమానాస్పదంగా మృతి చెందిన బీటెక్ విద్యార్థి ప్రణీత్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. మనుబోలు మండలం వీరంపల్లెకు చెందిన ప్రణీత్ (22) బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారు గురువారం రూరల్ సీఐ దశరథరామారావుకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ నేత సునీల్ మాట్లాడుతూ ప్రణీత్ ఆత్మహత్యకు పాల్పడేంత పిరికి వాడు కాదని, అతని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు.

వైద్య పరికరాల అందజేత



కిట్లను అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

తడ: స్థానిక సబ్ సెంటర్ పరిధిలోని పీహెచ్‌సీలకు గురువారం రూ.30 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను శ్రీసిటీలోని మోండలీజ్ చాక్లెట్ కంపెనీ అందజేసింది. తడ, వరదయ్యపాళెం, చిన్న పాండూరు, దాసుకుప్పం, నాగలాపురం, బీఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు శ్రీసిటీలోని మోండలీజ్ చాక్లెట్ కంపెనీ సహకారంతో సేవ్ ది చిల్డ్రన్ హెల్త్ సిస్టమ్ స్ట్రెంత్‌నింగ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తడలో ఈ పరికరాలు అందజేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ వికాస్, ప్లాంట్ డైరెక్టర్ అమిత్‌జైన్, సర్పంచ్ ఆర్ముగం, ప్రాజెక్ట్ డైరెక్టర్ జతిన్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

గూడూరు: స్థానిక బజారు వీధిలో ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి శత వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయాన్ని పలు రకాల సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. అలాగే వీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళలు కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నాయుడుపేటటౌన్: భార్య పుట్టింటికి వెళ్లి, తిరిగి రాలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. జువ్వలపాళెం గ్రామానికి చెందిన గోవా వెంకట రమణయ్య(38)కు దొరవారిసత్రానికి చెందిన లక్ష్మితో 2006లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. బెల్దారీ పనులు చేసుకునే వెంకటరమణయ్య మద్యానికి బానిసై భార్యా పిల్లల బాగోగులు పట్టించుకోక పోవడంతో లక్ష్మి మూడు నెలల కిందట పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో వెంకటరమణయ్య మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. మధ్యాహ్నం వెంకరమణయ్యకు భోజనం ఇచ్చేందుకు వచ్చిన అతడి సమీప బంధువు ఇంటి తలుపులు తీసి చూడడంతో ఈ విషయం గుర్తించారు. పోలీసులకు సమాచారం అందజేయడంతో సీఐ నరసింహారావు, ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గోడౌన్.. గిట్టుబాటుకు దన్ను

నూర్పిడిల సమయం.. పంట దిగుబడులకు దక్కని ధర.. దళారీల బెడద.. నిల్వకు వీలు లేని పరిస్థితి. నుంచి అన్నదాతను గట్టెక్కించాలని జగనన్న నిర్ణయం.. వెరసి పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో గోడౌన్ల నిర్మాణం.. ఫలితం మంచి ధరకు ఉత్పత్తుల విక్రయం.. గిట్టుబాటుకు దన్ను.. పుడమి పుత్రుడికి లాభం.. దళారీవ్యవస్థకు చెక్.. ఇదీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రైతుకు దక్కిన భరోసా.

- 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మాణం
- పూర్తి కావచ్చిన నిర్మాణం



ఏకొల్లులో పూర్తి అయిన గోదాము



నిర్మాణంలో ఉన్న వేబ్రిడ్జి

దొరవారిసత్రం: జగనన్న ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట సాగు నుంచి దిగుబడి విక్రయం వరకు రైతును అన్ని విధాలుగా ఆదుకుంటోంది. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరింత అండగా నిలిచి పండిన పంట నిల్వ చేసుకునేలా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏపీఎస్) నిధులతో మార్కెటింగ్ శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సకల సదుపాయలు కలిగిన 500 మెట్రిక్ టన్నుల సామర్థంతో గోదాము(గోడౌన్)ల నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ గోదాముల్లో పండిన పంటను రైతులు నిల్వ చేసుకుని, గిట్టుబాటు ధరలు వచ్చినప్పుడు విక్రయించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో గోదాముల నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయి.

మండలంలో 5 గోడౌన్లు

దొరవారిసత్రం మండలంలో 5 గోడౌన్లు 2021–22 ఏడాదికి మంజూరు చేయగా ఇందులో మూడు గోడౌన్ల నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఒక్కొక్క గోదాము రూ.40 లక్షలు వ్యయంతో ఎకరా విస్తీర్ణంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తుంది. అక్కడే వేబ్రిడ్జీ ఏర్పాటు, పంటలను ఆరబెట్టుకునేలా చిన్న పాటి ప్లాట్‌ఫామ్ తదితర వసతులతో గోదాము నిర్మాణం పనులు చేపట్టారు. ఇప్పటికే నెలబల్లి, ఏకొల్లు, వేణుంబాకంలో గోదాముల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. వేబ్రిడ్జీ తదితర పనులు చకచక సాగుతున్నాయి. తొగరాముడి గ్రామంలో 80 శాతం వరకు గోదాము నిర్మాణం పనులు పూర్తి కాగా కల్లూరులో గోదాము నిర్మాణానికి స్థలం కేటాయింపులో ఆలస్యం జరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు. గోదాము నిర్మాణం పనులు పూర్తి అయ్యి, రైతులకు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లోని తమకు ఎంతగానో ఉపాయోగపడుతాయని అన్నదాతలు తెలిపారు.

ఎంతో మేలు



దొరవారిసత్రం మండలంలో అధికంగా వరి పండిస్తారు. గిట్టుబాటు ధరలు లేని సమయంలో గ్రామాల్లో రైతులు పండిన ధాన్యం గోదాముల్లో దాచుకోవచ్చు. ధరలు ఉన్న సమయంలో అమ్ముకుని అధిక లాభాలు పొందవచ్చు. ఈ గోదాములతో రైతులకు చాలా మేలు చేకూరుతుంది.

–దువ్వూరు గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, డీవీ సత్రం

రైతుల పాలిట వరం



గ్రామీణ ప్రాంతాల్లో గోదాములు నిర్మించడం రైతులకు వరం. వర్షాలు వచ్చిన సమయాల్లో కోత కోసిన ధాన్యం, వేరుశనగ తదితర పంట దిగుబడులు గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చు. నిల్వ ఉన్న పంటను రైతులు ఏ సమయంలోనైనా సులువుగా విక్రయించుకోవచ్చు.

–నల్లరెడ్డి సురేష్‌రెడ్డి, రైతు, నెలబల్లి గ్రామం

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం



దొరవారిసత్రం మండలానికి కేటాయించిన గోదాముల నిర్మాణం పనులు ఎప్పకప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ పనులన్నీ మార్కెటింగ్ ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. కల్లూరులో కూడా స్థలం కేటాయించారు. త్వరలోనే పనులు మొదలుపెడతాం.

–షేక్ గఫూర్, సీఈఓ, పీఏపీఎస్, నెలబల్లి

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేసి, నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మీకందరికీ మంచి జరిగిందనిపిస్తే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని 7,8 వార్డులు నాగరాజపురం సచివాలయం పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, ఝాన్సీనగర్, ఇందిరానగర్, నాగరాజపురంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే సంజీవయ్యకు ఆ ప్రాంత ప్రజలు కర్పూర హారతులిచ్చి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేసి, మీ ఇంటికి ఏఏ పథకాలు అందాయని ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేటలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.142 కోట్లతో పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. టీడీపీ నాయకుడు లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని, ఆయన ఒళ్లు తగ్గించుకోవడానికి చేస్తున్న వ్యాయామయాత్రలా ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్లు పోలూరు పద్మా మిల్టన్, చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, సన్నారెడ్డి సౌజన్య, నాయకులు మారంరెడ్డి మునీష్‌రెడ్డి, పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్వామిరెడ్డి, అయితా శ్రీధర్ జెట్టి వేణుయాదవ్, అలవల సురేష్ పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

ఓజిలి: కేంద్రప్రభుత్వ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల స్త్రీశక్తి భవనంలో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై పంచాయతీ కార్యదర్శులు, వీఓ ఏ, సీసీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన పథకంలో సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే లబ్ధిదారులకు రూ.2 లక్షల ప్రమాద బీమా అందతుందన్నారు. 18– 50 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన పథకంలో కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షలు వరకు ప్రమాదబీమా, అంగవైకల్యం చెందితే రూ.1 లక్ష బీమా వర్తిస్తుందన్నారు. దీనికి 18– 70 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిర్మలమ్మ, ఏపీఓ ఉషారాణి, సీసీలు శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వెంకటగిరిరూరల్: వల్లివేడు సమీపంలోని 9వ బెటాలియన్ కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జయంత్యోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణాల నడుమ లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు 9వ బెటాలియన్ కమాండెంట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాత్రి గరుడోత్సవం నిర్వహించారు.

బాలాయపల్లిలో....

బాలాయపల్లి మండలంలోని అలిమిలి పంచాయతీ కనుమరాయికొండపై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ దర్శించుకున్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ 4.23 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న విద్యార్థులు

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల ద్వారా వచ్చిన కానుకలను గురువారం దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కించారు. జాతర రెండురోజులకు మొత్తం రూ 4,23,415 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత తెలిపారు. ఈ ఏడాది అధికంగా రూ.లక్ష అదనంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యనిర్వాణాధికారి పాయసం శాంత రావు, ఆలయ కమిటీ చైర్మన్ గంధవల్లి సిద్దయ్య, సభ్యులు దేవత చెంచు కిషోర్‌శెట్టి, రాయపు శేఖర్, గంధవల్లి భరత్, అర్చకులు రాయపూడి మునిసురేష్, గాదిరెడ్డి గోపి పాల్గొన్నారు.

నేడు అన్నదానం : జాతర వేడుకల్లో భాగంగా గడియారం సెంటర్ వద్ద ఉన్న పోలేరమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం చేయన్నుట్లు ఆలయ కమిటీ చైర్మన్ జీ సిద్దయ్య తెలిపారు. కొండా రాజగోపాల్‌శెట్టి జ్ఞాపకార్థంగా పారిశ్రామికవేత్త పెసల జయబాబు సోదరులు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం

కలువాయి: పెంచలకోన బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు కుల్లూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మాదాసు గంగాధరం, వారి కుటుంబ సభ్యులు కుల్లూరు సెంటర్‌లో గురువారం అన్నదానం చేశారు. సుమారు 500 మందికి అన్నదానం చేశారు. అలాగే కుల్లూరు బైపాస్ రోడ్డు సెంటర్‌లో గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి, సుమారు 2 వేల మందికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సమితి సభ్యులు పెంచలయ్య, నరసింహులు, డిష్ నరసింహులు, ప్రసాద్, శంకరయ్య, వెంకటసుబ్బయ్య తదతరులు పాల్గొన్నారు.

బైకులో దూరిన పాము




పామును బయటకు తీయడానికి యత్నిస్తున్న మెకానిక్ (ఇన్‌సెట్) బైక్‌లోకి వెళ్లిన పాము

కలువాయి: ఓ బైకులో పాము దూరి కలకలం సృష్టించిన సంఘటన గురువారం కలువాయిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కలువాయి పడమటి వీధి మిట్టపై ఉన్న వాసు అనే యువకుడు గురువారం ఉదయం మోటార్‌బైకు తీసేందుకు ప్రయత్నించగా ఫుట్‌రెస్ట్‌పై నల్లకట్టుడు పాము ఉండటాన్ని గమనించాడు. అక్కడి నుంచి పామును తరిమేందుకు అతను ప్రయత్నించగా పాము ట్యాంకు కిందకు చేరి బైకులోనే ఉండిపోయింది. దీంతో ఆ యువకుడు బైక్‌ను మెకానిక్ వద్దకు తీసుకురాగా అతను చాకచక్యంగా పామును బయటకు తీసి, చంపివేశారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

చిల్లకూరు: ఓడూరు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. సుమారు 40 ఏళ్ల వ్యక్తి లుంగీ తో రైల్వేస్టేషన్ సమీపంలోనే తిరుగుతూ ఉండేవాడు. అతడు జైపూరు ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చే సమయంలో ఉన్నట్టుండి రైలు పట్టాలపై పడుకున్నాడు. దీంతో అతడిని ఢీ కొనడంతో అతను మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో గూడూరు జీఆర్‌పీఫ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్



గాయపడిన వ్యక్తిని బైక్‌పై తీసుకెళుతున్న కానిస్టేబుల్ రాంబాబు

చిల్లకూరు: ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించి కానిస్టేబుల్ తన మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడుకు చెందిన రమేష్ అనే వ్యక్తి కోట ప్రాంతంలో మామాడి తోటలు లీజుకు తీసుకుని ఉన్నాడు. ఈ క్రమంలో అతని కుటుంబ సభ్యులను గూడూరులో రైలు ఎక్కించేందుకు వేకువజామున కోట నుంచి బయలు దేరి వచ్చి తిరిగి కోటకు వెళుతున్నాడు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీ కొంది. దీంతో అతడు గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి 108కి సమాచారం ఇచ్చారు. ఆ వాహనం రావడం ఆలస్యం అవుతుందని తెలిపారు. దీంతో వారు చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సెంట్రీ విధులు నిర్వహిస్తున్న రాంబాబు సంఘటన స్థలానికి చేరుకుని, తన బైక్‌లో స్థానికులు సహకారంతో గాయపడిన వ్యక్తిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించి పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. ఈ విషయమై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించం

నాయుడుపేటటౌన్: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని అర్బన్ సీఐ నరసింహారావు హెచ్చరించారు. పట్టణంలోని గడియారం సెంటర్, బజారు వీధి తదితర కూడళ్ల వద్ద గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టణంలో ప్రజలకు ట్రాఫిక్ ఇక్కట్లు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్య, వైద్యానికి పెద్ద పీట



ఏరియా ఆస్పత్రిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

గూడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యతో పాటు వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రూ.26 కోట్ల వ్యయంతో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రూ.1.15 కోట్లతో రైతు బజార్ నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు.

మా భూములకు పట్టాలిప్పించండి

తామంతా పేదలమని, ఎన్నో ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకుంటున్నామని, వాటికి సంబంధించి తమకు పట్టాలిప్పించాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిని పేదలు కోరారు. సొసైటీకాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం గూడూరు రూరల్ మండలం తిరుగవెంగళాయపల్లె గ్రామానికి చెందిన పలువురు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

మధుయాదవ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

చిట్టమూరు: స్థానిక వైఎస్సార్ సీపీ నేత, ఎన్‌డీసీబీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మేరిగల మధుయాదవ్‌ను గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు గురువారం పరామర్శించారు. మధుయాదవ్ తండ్రి మేరిగల కస్తూరయ్య అనారోగ్యంతో కొద్ది రోజుల కిందట మృతి చెందాడు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు గురువారం జరిగిన కస్తూరయ్య ఉత్తరక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దువ్వూరు శేషరెడ్డి, పార్టీ నేతలు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, వంకా రమణయ్య, గజేంద్రరెడ్డి, చెన్నూరు శ్రీహరిరెడ్డి, వంకా చెంచయ్య, సర్పంచ్‌లు విజయులురెడ్డి, ఎర్రబోతు మణి పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



లక్ష్మీనరసింహుడి కల్యాణం చేస్తున్న అర్చకులు

దక్కిలి: మండలంలోని పెదకోన సమీపంలో ఉన్న యోగలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, చందనా అలంకరణ, హోమం, సుదర్శన యోగం నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఆర్డీఓ చొరవ అభినందనీయం



ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్

గూడూరు: కోటలో ఆక్రమణల తొలగింపులో ఆర్డీఓ కిరణ్‌కుమార్ చొరవ అభినందనీయమని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆయన ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో అభివృద్ధిపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందాల్సిన కోటలో ఆక్రమణలతో అవి ఆగిపోయాయన్నారు. ఈ క్రమంలో ఆర్డీఓ ఎవరికీ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఆక్రమణలను దగ్గరుండి తొలగించారన్నారు.

నెలబల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణ



ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి సమీపంలో జాతీయ రహదారి వెంబడే ఉన్న రూ.లక్షలు విలువ చేసే సుమారు ఎకరా అసైన్డ్ భూమిని ఆక్రమించి గురువారం పట్ట పగలే ట్రాక్టర్లతో మట్టి తరలించి చదును చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే విలువైన భూములు ఆక్రమణకు గురికాకతప్పదని స్థానికులు అంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



కూలీలకు మజ్జిగ అందజేస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

పెళ్లకూరు: ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలు వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. గురువారం నెలబల్లిలో జరుగుతున్న పంట కాలువ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో పని ప్రదేశంలో కూలీలకు టార్పాలిన్ పట్టలు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే పని చేసే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం కూడా ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల వర్షం సమయంలో చెట్లు కిందకు వెళ్లడం ప్రమాదకరమన్నారు. ఎండకు ముందుగా పని ముగించుకుని ఇంటికి చేరుకోవాలని తెలిపారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈసీ భాను, టీఏ గోవర్ధన్, వెంకటేష్, ఎఫ్ఏ తిరుపాలు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



భూమిపూజ చేస్తున్న అధికారులు

పెళ్లకూరు: జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ సురేష్ బాబు అన్నారు. గురువారం మండలంలోని చిల్లకూరు, శిరసనంబేడు, చెన్నప్పనాయుడుపేట, చెంబేడు, బంగారంపేట గ్రామాల్లో 152 గృహాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ శిరసనంబేడు 44, చెన్నప్పనాయుడుపేటలో 18, చిల్లకూరులో 42, చెంబేడులో 39, బంగారంపేటలో 9 మొత్తం 152 పక్కా గృహ నిర్మాణాలకు సంబంధించి భూమిపూజ చేసినట్లు తెలిపారు. పక్కా గృహాలకు కావాల్సిన ఇసుక స్వర్ణముఖినది నుంచి తీసుకెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేస్తామన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసుకునేలా బిల్లులు చెల్లింపుల్లో జాప్యం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పగడాల హరిబాబురెడ్డి, పెంచలయ్య, ధర్మయ్య, స్వప్న పాల్గొన్నారు.